ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

సిద్దిపేట

శనివారం 22 నవంబరు 2025

తడిసిన వడ్లు.. ఇక ఇట్టే సిద్ధం!

● ధాన్యాన్ని నిమిషాల్లో ఆరబెట్టే ఆటోమేటెడ్ డ్రయ్యర్ రూపకల్పన

7

జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ప్రపంచంలోనే అతి పెద్ద నంది విగ్రహం

ఎర్దనూర్‌లో పెద్ద రాతి నుంచి నంది విగ్రహం తీర్చదిద్దడానికి శ్రీకారం

నంది విగ్రహ పనుల పూజా కార్యక్రమంలో పాల్గొన్న జగ్గారెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్‌తో మాట్లాడి ఆలయాలు, మసీద్‌లు, చర్చిల కోసం నిధులు అందేలా చూస్తా

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో పరిశీలిస్తున్న జగ్గారెడ్డి



ఎర్దనూర్‌లో నంది విగ్రహ తయారీ కోసం పూజలు నిర్వహిస్తున్న జగ్గారెడ్డి, మహేశ్వరశర్మ

సంగారెడ్డి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం ఫసల్‌వాది వద్ద ఉన్న జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ప్రపంచంలోనే అతి పెద్ద నంది విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. కంది మండలం ఎర్దనూర్ గుట్టల్లో నంది విగ్రహాన్ని తీర్చిదిద్దడానికి అవసరమైన అతిపెద్ద శిలను గుర్తించారు. ఈ మేరకు జ్యోతిర్వాస్తు విద్యాపీఠం సిద్ధాంతి డాక్టర్ మహేశ్వరశర్మతో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి శుక్రవారం సదరు శిల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ శిలను ఫసల్‌వాదిలోని విద్యాపీఠానికి త్వరలో తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. అనంతరం జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో భారీ నంది విగ్రహాన్ని ఏర్పాటుచేసే స్థలాన్ని జగ్గారెడ్డి పరిశీలించారు. జ్యోతిర్వాస్తు విద్యాపీఠం సిద్ధాంతి మహేశ్వరశర్మ నంది విగ్రహ నమూనాను జగ్గారెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాలకు సంబంధించిన ఆలయాలు, మజీదులు, ప్రార్థన మందిరాలు, ఇతర ధార్మిక కార్యక్రమాల కోసం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని నియోజకవర్గానికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్ తదితరులు ఉన్నారు.

డ్యూటీకి డుమ్మా కొడితే జీతంలో కోత

● విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● కలెక్టర్ హైమావతి



చింతమడక ఆరోగ్యకేంద్రంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

సిద్దిపేటరూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి); అనుమతి లేకుండా ఇష్టానుసారంగా విధులకు గైర్హాజరైతే వేతనం లో కోత పడుతుందని కలెక్టర్ హైమావతి అధికారులను, వైద్యులు, సిబ్బందిని హెచ్చరించారు. అలాగే విధుల పట్ల నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలుంటాయన్నారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పుల్లూరు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. చింతమడక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే విధులకు హాజరయ్యారు. మిగితా సిబ్బంది గైర్హాజరవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ ఆఫీసర్ సెలవులో ఉన్నట్లు సిబ్బంది చెప్పగా జిల్లావైద్యాధికారికి ఫోన్ చేసి ఆరా తీశారు. అనంతరం పుల్లూరు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం తేమ శాతం రాగానే తూకం వేయాలని సిబ్బందికి సూచించారు.

రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలి

సిద్దిపేట క్రైం : పకడ్బందీగా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రతా కమిటీ, మత్తు పదార్థాల వినియోగ నివారణకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.



టెడ్డీబేర్ వేషధారణతో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టెడ్డీ చెప్పింది ట్రాఫిక్ రూల్స్..

సిద్దిపేట క్రైం నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలను పాటించడంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సిద్దిపేట ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ముస్తాబాద్ చౌరస్తా వద్ద వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలు మన శ్రేయస్సు కోసమే, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తేనే రోడ్డు ప్రమాదాలను నివారించగలమని ట్రాఫిక్ పోలీసులు, ఆర్‌కే టెడ్డి ఈవెంట్ నిర్వాహకులు సూచించారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ పెట్టుకోవడం, అతివేగాన్ని నియంత్రించడం వంటి అంశాలను సరళమైన రీతిలో వివరించారు. ఈవినూత్న కార్యక్రమంపై ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ పోలీసులను అభినందించారు. ఈ అవగాహన కార్యక్రమం సిద్దిపేటలో రోడ్డు భద్రతపై ఒక కొత్త చర్చకు, సానుకూల మార్పుకు నాంది పలికింది. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ విజయభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఊరు..పోరు

● హుస్నాబాద్ డివిజన్‌లో తొలివిడత ఎన్నికలు

● రెండు, మూడు విడతల్లో సిద్దిపేట, గజ్వేల్ డివిజన్లు

● రేపు తుది ఓటరు జాబితా సిద్ధం

● పంచాయతీ ఎన్నికలకు మొదలైన కసరత్తు

● రిజర్వేషన్లపైనే వీడని ఉత్కంఠ

● ఎన్నికల తేదీల వైపే అందరి చూపు

గ్రామపంచాయతీ ఎన్నికల దిశగా అధికార యంత్రాంగం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే నెలలోనే ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అందుకే కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు మరోసారి అవకాశం కల్పించారు. ఇప్పటికే పాత ఓటరు జాబితాను అభ్యంతరాల స్వీకరణ కోసం గ్రామపంచాయతీల వద్ద ప్రదర్శించారు. ఈ నెల 23 న తుది జాబితాను ప్రకటిస్తున్నారు. ఇక రిజర్వేషన్లు, ఎన్నికల తేదీల వైపే అందరి చూపు నెలకొంది.

సిద్దిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



గజ్వేల్ మండలం దిలాల్‌పూర్‌లో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న గ్రామస్థులు



సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు త్వరలోనే కొలువు దీరనున్నారు. ఈ దిశగా కసరత్తు నడుస్తోంది. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహిస్తారనే ప్రచారం జరిగినప్పటికీ మళ్లీ పంచాయతీ ఎన్నికల వైపే ఎలక్షన్ కమిషన్ మొగ్గు చూపింది. 2019 జనవరిలో చివరిసారిగా పంచాయతీ ఎన్నికలు జరిగాయి. 2024 ఫిబ్రవరి నెలతో వీరి పదవీకాలం ముగిసింది. దాదాపు 22 నెలల నుంచి రిజర్వేషన్ల కారణంగా పంచాయతీ ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నాయి.

మూడు దశల్లో ఎన్నికలు..

జిల్లాలో 508 గ్రామపంచాయతీలు, 4,508 వార్డులు ఉన్నాయి. మూడు విడతల్లో ఎన్నికలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రమంతటా ఇదే విధానం అమలులో ఉండడంతో పోలింగ్ సిబ్బంది, బందోబస్తు చేసే పోలీసు సిబ్బంది పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు విడతలవారీగా చేపడుతున్నారు.

తొలి విడతలో: హుస్నాబాద్ డివిజన్‌లోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి, ధూళిమిట్ట, మద్దూరు మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

రెండో విడతలో: సిద్దిపేట రెవెన్యూ డివిజన్‌లోని సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, నంగునూరు, చిన్నకోడూరు, నారాయణరావుపేట, తొగుట, దౌల్తాబాద్, దుబ్బాక, మిరుదొడ్డి, అక్బరుపేట-భూంపల్లి, చేర్యాల, కొమురవెల్లి మండలాలు.

మూడో విడతలో: గజ్వేల్ డివిజన్‌లోని గజ్వేల్, కొండపాక, కుకునూరుపల్లి, జగదేవ్‌పూర్, వర్గల్, మర్కుక్, ములుగు, రాయపోల్ మండలాల్లో నిర్వహించనున్నారు.

మరోసారి ఓటు నమోదు

ఇప్పటికే పలుమార్లు ఓటరు జాబితాలను ప్రదర్శించారు. తాజా పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మరోసారి ఓటు నమోదు చేసుకొనే అవకాశాన్ని కల్పించారు. దరఖాస్తులు సైతం స్వీకరిస్తున్నారు. ఈనెల 23న గ్రామపంచాయతీల్లో తుది ఓటరు జాబితాలను ప్రదర్శించనున్నారు. చనిపోయినవారి పేర్లు ఇప్పటికీ తొలగించలేదు. కొందరి ఇంటి చిరునామాలు, ఇంటి పేర్లలోనూ పొరపాట్లు జరిగినట్లుగా తెలుస్తున్నది. ఇదే ఫైనల్ జాబితాగా అధికారులు పరిగణిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 6,54,628 మంది ఓటర్లు ఉండగా తుదిజాబితాలో పెరిగే అవకాశం ఉంది.

రిజర్వేషన్లు.. తేదీలపైనే ఉత్కంఠ..

శరవేగంగా పంచాయతీ ఎన్నికల ప్రక్రియ వైపు అడుగులు

మిగతా 8లో...

రంగనాయకసాగర్ నుంచి

దేవాదుల నీటిని మళ్లించాలి

● మంత్రి ఉత్తమ్‌ను కోరిన ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

చేర్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రంగనాయకసాగర్ కుడికాలువ నుంచి దేవాదుల డీ-3కెనాల్‌కు నీటిని మళ్లించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. నీటిని మళ్లించడం వల్ల సిద్దిపేట జిల్లా చేర్యాల, ధూళిమిట్ట మండలాలలోని పలు గ్రామాల్లో సుమారు 8వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. 2008లో దేవాదుల చేపట్టినా కాలువ పనులు ఇప్పటికీ పూర్తికాకపోగా, ఆయకట్టుకు నీరుచేరడం లేదని, ఆయా మండలాల రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రంగనాయకసాగర్ కుడికాలువ ఎల్‌డీ-10డిస్ట్రిబ్యూటరీకి సమాంతరంగా తపాస్‌పల్లి రిజర్వాయర్ ఎడమ కాలువ డీ-3 ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా కాలువలను అనుసంధానిస్తూ రెగ్యులేటర్/స్లూయిస్ నిర్మించి నీటి ని మళ్లిస్తే చేర్యాల మండలం దానంపల్లి, అర్జునపట్ల, కమలాయపల్లి, ఆకునూరు, ధూళిమిట్ట మండలం ధూళిమిట్ట, జాలపల్లి, లింగాపూర్ తదితర గ్రామాల్లో 7,800ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈప్రాంత రైతుల ప్రయోజనాల దృష్ట్యా త్వరితగతిన నీటిమళ్లింపు చేపట్టేందుకు సం బంధిత అధికారులకు తగు ఆదేశాలివ్వాలని అభ్యర్థించారు.

శుభకార్యాలకు

విరామం

● దాదాపు మూడు నెలల పాటు ముహూర్తాలు లేవు

● ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 17 వరకు శుక్రమౌఢ్యం

7



చెరువులో దీపాలను వదులుతున్న భక్తులు

పోలి పాడ్యామి వేడుకలు

సిద్దిపేటలో పోలి పాడ్యామి వేడుకలు నిర్వహించారు. శుక్రవారం సిద్దిపేటలోని కోమటి చెరువులో మహిళలు దీపాలను వదిలారు. మార్గశిర మాసం ప్రారంభం పోలి పాడ్యామి సందర్భంగా దీపాలను నదులు లేదా చెరువుల్లో గంగమ్మకు సమర్పిస్తే శుభం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

సిద్దిపేట కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి)



భానుడి ప్రసాదం

ప్రతి ఒక్కరికీ విటమిన్-డి చాలా అవసరం.. ఇక నవజాత శిశువులకైతే మరీ ముఖ్యం. అందుకే ఉదయం 8 గంటల వరకు సున్నితమైన సూర్యరశ్మి ఉంటుందని, దాదాపు 30 నిమిషాల పాటు శిశువులను ఎండలో ఉంచితే విటమిన్-డి అందుతుందని వైద్యులు సూచిస్తుంటారు. శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వాసుత్రిలో ఇలా శిశువులతో తల్లిదండ్రులు, బంధువులు ఎండలో కూర్చోగా 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో డీఈవో నియామకాలు చేపట్టాలి

● ఉపాధ్యాయుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా : మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ● ముగిసిన జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థిని



విద్యార్థుల ఎగ్జిబిట్లను తిలకిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట/సిద్దిపేటకల్చరల్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాశాఖలో జిల్లా విద్యాధికారుల (డీఈవో) నియమకాలు చేపట్టాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించిన జిల్లా సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా విద్యార్థులు రూపొందించిన పలు ఎగ్జిబిట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ముగ్గురు మాత్రమే రెగ్యూలర్ డీఈవో పోస్టులు ఉన్నాయని తెలిపారు. విద్యాశాఖలో పలువురు ఐఏఎస్‌లను నియమించారని, వారిని నియమిస్తే విద్యావ్యవస్థ బాగుపడదన్నారు. ఐఏఎస్‌లు ఎక్కువగా రెవెన్యూ, రూరల్ డెవలమెంట్ మీద దృష్టి పెడతారని, అన్ని జిల్లాలో 33 మంది డీఈవో రెగ్యూలర్ పోస్టులు నియమించాలన్నారు. ఉపాధ్యాయులకు చాలా సమస్యలున్నాయని, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్ ఇవ్వండం లేదని మండిపడ్డారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాబోయే అసెంబ్లీలో మాట్లాడుతానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

పదోతరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే శతశాతం ఉత్తీర్ణత సాధించి సిద్దిపేటను మొదటి స్థానంలో నిలపాలన్నారు.

మిగతా 8లో...

నచ్చిన రంగంలో రాణించాలి

● ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి



విద్యార్థిని అభినందిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

విద్యార్థులు నచ్చిన రంగం ఎంచుకుని రాణించాలని ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డిఆకాంక్షించారు. బాలల వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ.. 2047 వరకు వికసిత్ భారత్‌గా అవతరించి ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్ట్‌ల విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, బహుమతులను అందజేశారు. సరికొత్త ఆవిష్కరణలకు సైన్స్ ఫెయిర్ కేంద్రాలుగా మారాలని ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కొత్త ఆలోచనలు, సృజనాత్మకత వెలికితీయడానికి సైన్స్‌ఫెయిర్ లాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు.



షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

జహీరాబాద్/కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదాలు జరిగాయి. సిర్గాపూర్ మండల పరిధిలోని అంతర్గాం పత్యానాయక్ తండాలో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో 10 క్వింటాళ్ల పత్తి దగ్ధం కాగా ఆధార్, పట్టా, బ్యాంకు పాసు పుస్తకాలు దగ్ధమైనట్లు తండా వాసులు శుక్రవారం తెలిపారు. తండాకు చెందిన మారోని బాయి తన రేకుల షెడ్‌లో నివాసముంటుంది. ఇటీవల తమ చేనులో వేసిన పత్తిని తీసి ఇంటిలో వేసింది. గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం కాగా, వ్యవసాయ భూమి పట్టా, బ్యాంకు పాసు బుక్‌లు, ఆధార్ కార్డులు, ఇతర పత్రాలు దగ్ధమైనట్లు బాధితురాలు మారోని బాయి తెలిపింది. భర్త లేకపోవడంతో సొంతంగా వ్యవసాయం చేసి పండించిన పత్తి అగ్నికి ఆహుతి కావడంతో మారోనిబాయి కన్నీరు మున్నీరయింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరింది.

ధనసిరిలో ఇల్లు దగ్ధం

జహీరాబాద్ నియోజక వర్గంలోని మొగడంపల్లి మండలం ధనసిరి గ్రామంలో శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన మల్లారెడ్డి ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటనలో నాలుగు తులాల బంగారం, 80 తులాల వెండి, వంట సామగ్రి కాలిపోయాయి. గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేయడంతో వారు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు. ఇంట్లోనే పూర్తి వస్తువులు, దుస్తులు కాలిపోవడంతో కేవలం కట్టుబట్టలతోనే మిగిలిపోయారు. రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను తెలుసుకున్నారు.



సిర్గాపూర్ మండలం అంతర్గాం పత్యానాయక్ తాండాలో అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పత్తి, మొగడంపల్లి మండలం ధనసిరి గ్రామంలో దగ్ధమైన సామగ్రి

మద్యం తాగడానికి వచ్చి దోపిడీ

● 5 తులాల పుస్తెల తాడు, రూ.66 వేల నగదు చోరీ

మద్దూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాయపల్లిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ బెల్టుషాపు నిర్వాహకుడి ఇంటికి మద్యం తాగడానికి వచ్చి దోపిడీకి పాల్పడ్డారు. బాధితుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన యేల్ల కవితవెంకటేశం కుటుంబం బెల్టుషాపు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి సుమారు 9.35 గంటలకు మద్యం తాగడం కోసం గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి బీరు కొనుగోలు చేసి ఇంటి ముందు కూర్చొని తాగారు. కొద్దిసేపటి తర్వాత తలుపులు తీయాలని చెప్పి ఇంట్లోకి ప్రవేశించి దంపతులను బెదిరించారు. కవిత మెడలోని 3 తులాల పుస్తెల తాడు, 2 తులాల నల్లపూసల దండతో పాటు 53 వేల నగదును దోచుకున్నారు. భయంతో అరువడంతో అక్కడ నుంచి పరారయ్యారు. యేల్ల కవితవెంకటేశం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

నర్సాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోని 9వ వార్డు పెద్దమ్మ కాలనీలోని రోడ్డు మధ్యలో డ్రైనేజీకి చెందిన మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. జేసీబీ వాహనం వెళ్లడం వల్ల మ్యాన్‌హోల్‌పై ఉన్న కవర్ పగిలిపోయిందని, దాని స్థానంలో మరొకటి ఏర్పాటు చేయకపోవడంతో కొన్ని రోజులుగా మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు మధ్యలో అది కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశముందని, రాత్రి పూట కూడా ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున వెంటనే మ్యాన్‌హోల్‌పై కవర్ వేయాలని కోరుతున్నారు.


రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పుల్కల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలంలోని శివంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై ఆ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. పంచభూతాలలో ఒకటైన అగ్నిని మనం అనేక విధాలుగా వినియోగిస్తామని జోగిపేట ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. అగ్నితో ఆటలు ఆడితే మనకు మనమే ప్రమాదాలను కొని తెచ్చుకున్నవాళ్లమవుతామన్నారు. అనుకోకుండా అగ్ని ప్రమాదాలు జరిగితే ప్రాథమికంగా తీసుకోవాల్సిన చర్యలు ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు.


శివంపేట జడ్పీహెచ్‌ఎస్‌లో అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములపై విచారణ జరపాలి

పటాన్‌చెరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములపై విచారణ జరపాలని సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఇంద్రేశం మున్సిపల్ కమిషనర్ మధుసూదనరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 120, 121, 125 సర్వే నెంబరులోని 240 ఎకరాల భూమిని ట్రక్ టెర్మినల్ పేరుతో సేకరించిందని తెలిపారు. భూములు ఇచ్చిన రైతులకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ అధికారులు హామీ ఇచ్చారని అన్నారు. ఇప్పుడు ఇతరులు సేకరించిన భూములను తమ పేర్లపై రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారని అన్నారు. ఈ విషయంలో ఉన్నత స్థాయి అధికారులు విచారణ జరపాలని కోరారు.


కమిషనర్ మధుసూదనరెడ్డికి వినతి పత్రం అందించిన సీపీఎం శ్రేణులు



అబుదాబిలో మడద వాసి మృతి

● బతుకుదెరువు కోసం రెండు నెలల క్రితం అక్కడికి..

● స్వగ్రామానికి మృతదేహం తెప్పించాలని మంత్రులకు వినతి

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం మడద గ్రామానికి చెందిన జేరిపోతుల వెంకటస్వామి(48) యూఏఈలోని అబుదాబిలో గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వెంకటస్వామి బతుకుదెరువు కోసం రెండునెలల క్రితం అబుదాబికి వెళ్లాడు. ఐదు రోజుల క్రితం అబుదాబిలో ఉదయం పనికివెళ్తున్న సమయంలో వెంకటస్వామి గుండెపోటుకు గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. వెంకటస్వామి మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకోవాలని కుటుంబ సభ్యులు వేడుకున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ విషయంపై రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. యూఏఈలోని భారత్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐలకు సమాచారం పంపామని వెంకటస్వామి మృతదేహాన్ని తన స్వగ్రామానికి తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులకు చెప్పి బరోసాకల్పించినట్లు తెలిపారు.


వెంకటస్వామి(ఫైల్)

యువకుడి ఆత్మహత్య

జిన్నారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గడ్డపోతారం అయ్యమ్మ చెరువు హనుమాన్ దేవాలయం సమీపంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం హనుమాన్ దేవాలయ సమీపంలోని ఓ చెట్టుకు యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా.. స్థానికులు గుర్తించారు. మృతుడు నవీన్ (25) కాగా, సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన వాడు. నవీన్ భార్య, ఇతర కుటుంబ సభ్యులతో స్థానికంగా ఉపాధి కోసం వచ్చి నివసిస్తున్నాడు. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.


ఒంటరితనం భరించలేక వృద్ధురాలు..

దుబ్బాక/ మిరుదొడ్డి, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం భర్త మరణించడంతో, అప్పటినుంచి దిగులుతో ఉంటున్న ఓ వృద్ధురాలు ఒంటరితనం భరించలేక జీవితం మీద విరక్తి చెంది, కూడవెల్లి వాగులో పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. అక్బర్‌పేట - భూంపల్లి మండలం భూంపల్లి ఎస్సై వి.హరీశ్ కథనం మేరకు.. దుబ్బాక మండలం రామక్కపేట గ్రామానికి చెందిన సామల మణెమ్మ (70) అనే వృద్ధురాలికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉండగా, వారందరికీ వివాహాలు జరిపించింది. ఆమె భర్త బాలనర్సయ్య ఏడాది క్రితం మృతి చెందగా, గ్రామంలో ఉన్న ఇద్దరు కొడుకుల వద్ద తలా కొన్ని రోజులు ఉంటూ జీవిస్తోంది. ఈ క్రమంలో సోమవారం దుబ్బాకలోని రెండు పడక గదుల గృహ సముదాయంలో ఉన్న ఆమె చెల్లెలు గుండ్ల కళావతి ఇంటికి వెళతానని చెప్పడంతో, కుమారుడు నాగరాజు అమెను దుబ్బాక బస్టాండ్లో దిగబెట్టి వెళ్లిపోయాడు. రాత్రి కుమారుడు చిన్నమ్మకు ఫోన్ చేసి తల్లి గురించి అడగగా, తమ ఇంటికి రాలేదని చెప్పడంతో ఆందోళన చెందారు. రెండు రోజులు ఆమె కోసం గాలించి, గురువారం దుబ్బాక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి కూడవెల్లి వాగులో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు శుక్రవారం శవపంచనామా చేసి, కేసు నమోదు చేశారు.

గృహిణి అదృశ్యం

రామచంద్రాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లిన గృహిణి అదృశ్యమైన ఘటన కొల్లూరు పోలీసు స్టేషన్ పరిధిలోని కేసీఆర్ నగర్(డబుల్ బెడ్‌రూం-2)లో చోటు చేసుకుంది. సీఐ గణేష్ పటేల్ తెలిపిన వివరాల ప్రకారం... కేసీఆర్ కాలనీలో నివాసముంటున్న షేక్ సంమాద్(27) ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య షేక్‌సభా ఫాతిమా(25) ఇంటి వద్దనే ఉంటుంది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. ఈ నెల 19న భర్తతో గొడవపడిన ఫాతిమా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.


ఫాతిమా(ఫైల్)









సర్దార్ పటేల్ స్ఫూర్తితో విశ్వగురువుగా దేశం

- ఉక్కు మనిషి, దేశభక్తి గల ప్రధాని మోదీతో సాధ్యం
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



ఐక్యతా ర్యాలీలో ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి ఉక్కు మనిషి, ధృడమైన దేశభక్తిగల వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ రూపంలో దేశానికి లభించడం అదృష్టమన్నారు. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్'గా ఉన్న మన దేశాన్ని 2047 నాటికి విశ్వ గురువుగా తీర్చిదిద్దడమే ప్రధాని మోదీ కల అని, అందుకు యావత్ దేశ ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని, మై భారత్ ఆధ్వర్యంలో శుక్రవారం దుబ్బాక పట్టణంలో ఐక్యతా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పట్టణంలోని అంగడి బజార్‌లో విద్యార్థులతో ఐక్యతా ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సర్దార్ పటేల్ కృషితోనే స్వాతంత్ర్యానంతరం హైదరాబాద్ సంస్థానంతో సహా 565 సంస్థానాలు భారత దేశంలో విలీనమయ్యాయని గుర్తుచేశారు. ర్యాలీలో మై భారత్ జిల్లా యువజన అధికారి రంజిత్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేశ్‌గౌడ్, పుర కమిషనర్ రమేశ్‌కుమార్, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంఈవో ప్రభుదాస్, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్వాడీ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కేతకీ ఆలయ హుండీ ఆదాయం రూ.33 లక్షలు

ఝరాసంగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన సంగారెడ్డి జిల్లాలోని శ్రీకేతకీ సంగమేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. 85 రోజులకుగానూ రూ.33 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో శివరుద్రప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రశేఖర్, ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్, పాలక మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


స్వామి వారి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

తడిసిన వడ్లు.. ఇక ఇట్టే సిద్ధం!

ధాన్యాన్ని నిమిషాల్లో ఆరబెట్టే ఆటోమేటెడ్ డ్రయ్యర్ రూపకల్పన

నూర్పిడి అయ్యాక అకాల వర్షాలు పడ్డప్పుడు తడిసిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులకు గోస తప్పడం లేదు. రోడ్ల మీదనో, కొనుగోలు కేంద్రాల్లోనో ఓ వారం పాటు ఆరబెడితే గానీ అమ్ముకోలేరు. తేమతో కూడిన ధాన్యాన్ని అమ్ముకోవడమూ సవాలుగా మారుతోంది. మరి.. ఎలాంటి కష్టనష్టాలు లేకుండా తడిసిన, తేమతో కూడిన ధాన్యాన్ని, ఇట్టే ఆరబెట్టుకునే యంత్రం అందుబాటులోకి వస్తే? సంగారెడ్డి జిల్లా కందిలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థులు అన్నదాతల కోసం నిమిషాల వ్యవధిలో ధాన్యాన్ని ఆరబెట్టే ఆటోమేటెడ్ డ్రయ్యర్‌ను రూపొందించారు.


ఆటోమేటెడ్ డ్రయ్యర్‌తో వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపక బృందం

- కంది వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ
- దేశంలోనే తొలిసారిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి
- 4 నుంచి 8 గంటల్లో 5–10 టన్నుల ధాన్యం ఆరబెట్టొచ్చు
- రైతులకు అతి తక్కువ ధరకు అందించేందుకు ప్రయత్నాలు

కంది, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఈ అద్భుత ఆవిష్కరణకు నాంది పలికారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.స్వామి సూచనలు, సలహాలతో ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం అధిపతి డాక్టర్ పద్మతో కలిసి వ్యవసాయ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు మహమ్మద్ ముదాసీర్, సాయి ప్రియ, నవ్య దాదాపు నాలుగు నెలల పాటు పరిశోధనలు జరిపి ఈ యంత్రానికి తుదిరూపునిచ్చారు. ఈ యంత్రానికి త్వరలోనే పేటెంట్ హక్కులు తీసుకొని మార్కెట్లోకి అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. పూర్తి స్వదేశీ సాంకేతికతతో దేశంలో తొలిసారి తయారైన ఆటోమేటెడ్ డ్రయ్యర్ ఇదే. దీన్ని అన్నదాతలకు అతి తక్కువ ధరకు అందించడానికి కృషి చేస్తున్నట్లు వారు చెప్పారు.

ఎలా పనిచేస్తుంది?

ఈ ఆటోమేటెడ్ డ్రయ్యర్‌పైన హైపర్ గొట్టం అనే పరికరం ఉంటుంది. దాని ద్వారా ధాన్యాన్ని నింపుతారు. అందులోంచి వడ్లు నెమ్మదిగా రోటర్‌స్క్రూ ద్వారా కన్వేయర్‌లోకి వెళతాయి. మిషన్‌కు అమర్చిన ప్రత్యేకమైన సెన్సార్ వేడి గాలిని కన్వేయర్‌లోకి పంపుతుంది. దీంతో వడ్లు తడిసినప్పుడు 50 నుంచి 60 శాతం ఉన్న తేమ నిమిషాల్లోనే 12 శాతం లోపు వస్తుంది. ఇలా ఆరబెట్టిన వడ్లను మేలు రకం విత్తనాలకు, హై క్వాలిటీ బియ్యం తయారీకి ఉపయోగించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

సమర్థంగా.. వేగంగా

వడ్లను ఎండలో ఆరబెట్టే సంప్రదాయ పద్ధతి కన్నా ఈ విధానం ద్వారా సమర్థంగా, వేగంగా ఆరబెట్టొచ్చునని.. పైగా నాణ్యతను కాపాడుతూ తేమ శాతం తగ్గించడం దీని ప్రత్యేకత అని చెప్పారు. నియంత్రిత ఉష్ణోగ్రత ద్వారా ధాన్యం పగిలిపోకుండా, రంగు మారకుండా, చెడు వాసన రాకుండా డ్రయ్యర్లు చూస్తాయని పేర్కొన్నారు. ఈ యంత్రం ద్వారా 4-8 గంటల్లోనే 5-10 టన్నుల మేర ధాన్యాన్ని ఆరబెట్టొచ్చు. ఈ యంత్రం ద్వారా నిర్వహణ ఖర్చులు, సమయాన్ని ఆదా చేయొచ్చునన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ప్రభుత్వ అనుమతితో ఈ ఆటోమేటెడ్ డ్రయ్యర్‌కు అతి త్వరలో పేటెంట్ హక్కులు కల్పించి రైతులకు అనుకూలమైన పరిమాణంలో తయారుచేసి మార్కెట్లో ప్రవేశపెడతాం.

రైతుల ఇబ్బందులను చూసి..



ఇటీవల రోడ్లపై ఎక్కడ చూసినా ఆరబెట్టిన ధాన్యమే కనిపిస్తోంది. రోడ్లపై వడ్లు అరబెట్టే ప్రయత్నంలో రైతుల ప్రమాదానికి గురవడం చూసి.. వారికి ఏదైనా ప్రత్యామ్నాయ మార్గం సూచించాలని నిర్ణయించుకున్నాం. వెంటనే మా వ్యవసాయ శాస్త్రవేత్తలతో చర్చించి ఆటోమేటెడ్ డ్రయ్యర్‌ను రూపొందించాం. రైతులకు అండగా ఉండడానికి మరిన్ని పరిశోధనలు జరపుతాం.

-మహమ్మద్ ముదసీర్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థి

రంగు మారదు.. నాణ్యతా తగ్గదు



కళాశాలలో మేము అభివృద్ధి చేసిన ఈ డ్రయ్యర్‌లో వడ్లను రబెడితే ఆ ధాన్యం రంగు మారదు. చెడు వాసన రాదు. నాణ్యత కూడా ఏమాత్రం తగ్గదు. ఇందుకోసం ప్రత్యేకంగా సెన్సార్లను తయారుచేసి అమర్చాం. ఇవి వడ్లను ఏమాత్రం దెబ్బతినకుండా ఆటోమేటిక్‌గా ఆరబెట్టడానికి ఎంత ఉష్ణోగ్రత కావాలో అంతే తీసుకొని వడ్లను ఆరబెడతాయి.

- సాయి ప్రియ, ఫైనల్ ఇయర్ విద్యార్థి

రైతుల కష్టాన్ని చూసి చలించిపోయాం



రైతన్నలు 4-5 నెలలు రెక్కలు ముక్కలు చేసుకుంటే కోత దశకొచ్చేసరికి ధాన్యం తడిసోతోంది. రైతుల ఈ కష్టాలను చూసి మేం చలించిపోయాం. వారికి అండగా నిలిచేందుకు వినూత్న ఆలోచనలు చేశాం. తొలుత వడ్లు ఆరబెట్టే సమస్యకు చెక్ పెట్టాలని పరిశోధనలు ముమ్మరంగా జరిపాము. మా ప్రొఫెసర్ల సూచనలు సలహాలతో ఆటోమేటెడ్ డ్రయ్యర్ యంత్రాన్ని అభివృద్ధి చేశాం.

- నవ్య, ఫైనల్ ఇయర్ విద్యార్థి

రాష్ట్రస్థాయికి ఐదు వైజ్ఞానిక నమూనాలు

- జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ
- ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రశంసలు




ఆకునూరు జడ్పీఎస్ఎస్ విద్యార్థుల ఎకో ఫ్రెండ్లీ క్లాత్ ఐరన్ నమూనా, బేగంపేట విద్యార్థిని కార్తీకకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రామచంద్రాపురం విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితరులు

రామచంద్రాపురం టౌన్/జోగిపేట/చేర్యాల/ మద్దూరు/రాయపోల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనల్లో ఆకట్టుకున్న, ప్రతిభ చూపిన ఐదు నమూనాలు రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాయి. జోగిపేట, రామచంద్రాపురం, చేర్యాల, ధూళిమిట్ట, రాయపోల్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు అర్హత సాధించాయి.

ఎకో ఫ్రెండ్లీ క్లాత్ ఐరన్..

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం, ఆకునూరు జడ్పీఎస్ఎస్ విద్యార్థులు కె.సాయిచరణ్, పి.ప్రవీణ్‌లు బొగ్గు, విద్యుత్ వ్యయం లేకుండా పనిచేసే పోర్టబుల్ ఎకో ఫ్రెండ్లీ క్లాత్ ఐరన్ నమూనాను రూపొందించారు. సోలార్ ప్లేట్, బ్యాటరీ ఉపయోగించి తయారుచేసిన ఈ పరికరం, ఇస్త్రీ చేసేవారికి, పర్యావరణానికి మేలు చేస్తుంది. గైడ్ టీచర్ రవీందర్ పర్యవేక్షణలో తయారైన ఈ నమూనా రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైంది.

ప్రమాదాల నివారణకు...

సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట జడ్పీఎస్ఎస్ విద్యార్థిని ఎం.శ్రావణి రూపొందించిన వేగంగా ప్రయాణించే వాహనాల నుంచి వీచే గాలి ద్వారా విద్యుత్ ఉత్పత్తి, ప్రమాదాల నివారణ ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ ప్రాజెక్ట్‌ను గైడ్ టీచర్ శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో రూపొందించింది. ఇదే పాఠశాలకు చెందిన కె.సంజన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలో ద్వితీయ బహుమతి సాధించింది.

స్మార్ట్ స్కూల్ బ్యాగ్

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని బేగంపేట ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని పి.కార్తిక రూపొందించిన స్మార్ట్ స్కూల్ బ్యాగ్ ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈమెకు గైడ్ టీచర్ భాస్కర్‌రెడ్డి సహకరించారు.

స్మార్ట్ టీ-లెట్‌కు ప్రథమ బహుమతి

సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని శ్రీసాయి క్రిష్ణవేణి హైస్కూల్ విద్యార్థిని శ్రీష చవాన్ రూపొందించిన స్మార్ట్ టీ-లెట్ (టాయిలెట్ పరికరం) రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైంది. కదలలేని రోగులు, వృద్ధుల కోసం రూపొందించిన ఈ పరికరం, సాధారణ కుర్చీని స్మార్ట్ టాయిలెట్‌గా మారుస్తుంది. టాయిలెట్ వ్యర్థం నేరుగా సెప్టిక్ ట్యాంక్‌కు చేరుతుంది. అనంతరం నాజిల్ ద్వారా నీరు చిమ్మి శుభ్రం చేయడమేగాక, అక్కడే ఉన్న డ్రయ్యర్ తడిని ఆరబెడుతుంది. గైడ్ టీచర్ సురేశ్ సహకారంతో రూపొందించిన ఈ ప్రాజెక్ట్ నారాయణఖేడ్‌లో జరిగిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది.

ఎమర్జింగ్ టెక్నాలజీ

సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం ఠాగూర్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న గణేష్ రూపొందించిన ఎమర్జింగ్ టెక్నాలజీ ఆకట్టుకున్నది. ఈ నమూనా రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది.

జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డీఈవో వెంకటేశ్వర్లు జోగిపేట విద్యార్థిని శ్రీషను అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి రామచంద్రాపురం విద్యార్థి గణేష్‌ను కూడా బృందంతో సహా అభినందించారు. బేగంపేట విద్యార్థిని కార్తీక, టీచర్ కేటగిరీలో అర్హత సాధించిన ఉపాధ్యాయుడు ధారా ప్రభాకర్‌ను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, డీఈవో శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

ఆర్టీసీ సిబ్బంది ఓపికతో విధులను నిర్వహించాలి : డీఎస్పీ

- ప్రగతి చక్ర అవార్డుల ప్రదానం

జహీరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ సిబ్బంది ఓపికతో విధులను నిర్వహించాలని జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ అన్నారు. శుక్రవారం జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో ఉత్తమ సేవలు అందజేసిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతి చక్ర అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ నిరంతరం కృషి చేస్తున్న సిబ్బందిని గుర్తించి వారికి అవార్డులు అందజేయడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మెనేజర్ టి.స్వామి, ఆర్టీసీ అసిస్టెంట్ మెనేజర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ సిబ్బంది డీఎస్పీ సైదానాయక్

షూటింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన షూటింగ్ రేంజ్ పోటీల్లో సంగారెడ్డి జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. వీరికి కొత్తగూడెం కలెక్టర్ జితేశ్‌విపాటిల్, డీవైఎస్‌వో పరంధామరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.

పైసలిస్తారా లేదా?

- ట్రాన్స్‌జెండర్ల బలవంతపు వసూళ్లు... ఆగడాలకు అడ్డూ అదుపూ లేదు
- వివాహాలు, శుభకార్యాల్లో రేట్లు ఫిక్స్ చేసి డిమాండ్
- అడిగినంత ఇవ్వకుంటే రచ్చరచ్చ

సంగారెడ్డి క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో కొందరు ట్రాన్స్‌జెండర్ల ఆగడాలు మితిమీరుతున్నాయి. జిల్లావ్యాప్తంగా శుభకార్యాలు, వివాహాలు జరుగుతున్న ప్రాంతాల్లో వీరు బలవంతపు వసూళ్లకు పాల్పడుతుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నరేష్

శుభకార్యాన్ని బట్టి రేట్

సంగారెడ్డి, అమీన్‌పూర్, పటాన్‌చెరు, రామచంద్రపురం, జిన్నారం, గుమ్మడిదల వంటి పట్టణ ప్రాంతాల్లో ఎక్కడ శుభకార్యం జరిగినా, ఇంటి ముందు టెంట్ వేసినా వెంటనే పది మంది ట్రాన్స్‌జెండర్లు గ్రూప్‌గా వచ్చి వాలిపోతున్నారు. ఇంటి యజమాని ఆర్థిక స్థితిని బట్టి, జరిగే శుభకార్యం (పెళ్లి, గృహప్రవేశం వంటివి) స్థాయిని బట్టి వీరు ఒక రేట్‌ను ఫిక్స్ చేసి డిమాండ్ చేస్తున్నారు. పెళ్లి, గృహ ప్రవేశం వంటి పెద్ద కార్యక్రమాలకు కనీసం రూ.30 వేల వరకు చెల్లించాలని బలవంతం చేస్తున్నారు. అడిగినంత డబ్బు ఇవ్వకుంటే వారు వెకిలి చేష్టలు ప్రదర్శిస్తూ, ఆ ప్రాంతంలో రచ్చరచ్చ సృష్టిస్తున్నారు. శుభకార్యానికి వచ్చిన బంధువులు, స్నేహితుల ముందు గిల్టీగా ఫీలవుతున్న ఇంటి యజమానులు చేసేది లేక, పరువు పోతుందనే భయంతో వారు అడిగినంత డబ్బు ఇవ్వక తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. అంతేకాకుండా, జిల్లాలోని ప్రధాన కూడళ్లలో కూడా వాహనాలను ఆపి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగులోకి వచ్చాయి.

పోలీసుల కౌన్సెలింగ్, ఎస్పీ హెచ్చరిక

బలవంతపు వసూళ్ల ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా పోలీసులు చర్యలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సుమారు 60 మంది ట్రాన్స్‌జెండర్లను గురువారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సీఐ నరేష్ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఈ విషయంపై స్పందిస్తూ.. జిల్లాలో ట్రాన్స్‌జెండర్లు బలవంతపు వసూళ్లకు పాల్పడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శుభకార్యాలయాలు, వ్యాపార సంస్థలు, ఇళ్లకు వెళ్లి నేరపూరిత చర్యలకు పాల్పడవద్దని ఆయన సూచించారు. ఎక్కడైనా హిజ్రాలు బలవంతపు వసూళ్లకు పాల్పడి ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

శుభకార్యాలకు విరామం

- దాదాపు మూడు నెలల పాటు ముహూర్తాలు లేవు
- ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 17 వరకు శుక్రమౌఢ్యం
- గృహ ప్రవేశాలు, వివాహాది కార్యాలకు పూర్తిగా బ్రేక్
- వ్యాపారాలకు తప్పని గడ్డుకాలం



జోగిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దాదాపు మూడు నెలలపాటు శుహముహూర్తాలకు విరామం రానున్నది. ఈనెల మార్గశిర శుద్ధ సప్తమి 28వ తేదీన ప్రారంభం కానున్న శుక్ర మౌఢ్యం(మూఢం) మాఘ బహుళ అమావాస్య ఫిబ్రవరి 17 వరకు కొనసాగనుంది. దీంతో 83 రోజుల పాటు శుభ కార్యాలకు సెలవు ప్రకటించాల్సిందే.

ఏమిటీ మూఢం ?

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుని కిరణాలలో కనుమరుగైపోవడాన్ని మూఢం అంటారు. గ్రహ శక్తులు బలహీనవడంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుభ కార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో, శుక్రుడు అంతే ప్రభావం కలవాడు. శుక్రుడు బలహీనమైతే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వం వంటి విషయాల్లో ప్రతికూలతలు ఏర్పడతాయని జ్యోతిష్యులు చెబుతున్నారు. అందుకే శుక్ర మౌఢ్యం ఉన్న కాలంలో శుభ కార్యాలు జరిపించడం శుభ సూచకం కాదని సూచిస్తున్నారు.

పవిత్ర తిథులు

మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. ఈసారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలు మాత్రమే ఉండగా, పుష్య మాసం శూన్య మాసమవుతోంది. ఇక మాఘ మాసంలోనూ ఒక్క ముహూర్తం లేకపోవడం గమనార్హం. గృహప్రవేశాలకు అనుకూలమైన రథసప్తమి, సరస్వతి జన్మదినమైన వసంత పంచమి మహా మాఘీగా కీర్తించబడే మాఘ పౌర్ణమి వంటి తిథులు ఈసారి మూఢంలోనే కలిసిపోతున్నాయి.

ఒక్క ముహూర్తమూ ఉండదు



ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడునెలల పాటు శుభకార్యాలకు మంచి రోజులు లేవు. శుక్ర మౌఢ్యం వల్ల ఒక్క శుభ ముహూర్తమూ ఉండదు. వివాహాలతో పాటు గృహ ప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలు, ఆఖరికి ఎంగేజ్‌మెంట్లు లాంటి కార్యాలు కూడా చేసుకోకూడదు. వైదిక, పురోహితంపైనే ఆధారపడ్డ పురోహితులకు ఈ మూడు నెలలు గడ్డుకాలమే.

- శిలాంకోట ప్రవీణాచార్యులు, వైదీక, స్మార్త పురోహితుడు

మేం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది



ఇప్పటికే ఫంక్షన్‌హాళ్లు పెరిగి, టెంట్‌షాపు యజమానులకు చాలా వరకు గిరాకీ తగ్గింది. ఏటా ఈ సీజన్‌లో వందల వివాహాలు జరిగేవి. చేతినిండా పని దొరికేది. కానీ ఈసారి ముహూర్తాలు లేకపోవడంతో మాదగ్గర పని చేసేవాళ్లకు వేతనాలు ఇవ్వడం కూడా కష్టం కానుంది. మాతో పాటు ఈ వ్యవస్థపై ఆధారపడ్డ ఇతర వృత్తుల వారికి పనులు ఉండవు. ఏం చేయాలో అర్థం కావట్లేదు.

- మోదిని వెంకటేశం, టెంట్‌హౌజ్ యజమాని

వ్యాపారాలపై ప్రభావం

శుభకార్యాలు లేకుంటే వివాహ మండపాలు, ఫంక్షన్ హాళ్లు, వస్త్ర దుకాణాలు, నగల షాపుల యజమానులు, స్వర్ణకారులు, క్యాటరింగ్, డెకరేషన్, ఫొటో, వీడియోగ్రఫీ, టెంట్ యజమానులు, పూల దుకాణదారులు, లైటింగ్, డీజే, అద్దె కార్లు, బస్సులు వంటి సంబంధిత రంగాల వ్యాపారాలు నెలల కొద్దీ నష్టపోవాల్సి వస్తుంది. పురోహితంపై ఆధారపడ్డ వారికి గడ్డుకాలమే.

సంక్షిప్తం

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు, గ్రామస్థులు

మద్దూరు. నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన హమాలీ కార్మికుడు ఇట్టబోయిన కృష్ణమూర్తి పనికి వెళ్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. కాగా మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులతో పాటు గ్రామస్థులు మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తలా కొంత నగదు జమచేసి మృతుడి కుటుంబానికి రూ. రూ.52,500లను అందించి ఉదారతను చాటుకున్నారు.

పేదింటి వధువుకు పుస్తె మట్టెల అందజేత



పుస్తెమట్టెలు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కుకునూరుపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద పేదింటి వధువుకి లయన్స్‌క్లబ్ అండగా నిలిచింది. శుక్రవారం కుకునూరుపల్లి గ్రామానికి చెందిన శ్రీహరి శారద దంపతుల కుమార్తె శివజ్యోతి వివాహం సందర్భంగా మాజీ సర్పంచ్ నరేందర్ చొరవతో లయన్స్‌క్లబ్ సిద్దిపేట జిల్లా గవర్నర్ ఈశ్వర్, మాజీ గవర్నర్ వైకుంఠం లయన్స్‌క్లబ్ సభ్యుల కుటుంబ సభ్యులకు పుస్తెమట్టెలను అందజేశారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ రూ. 10వేలు, పెద్ద వైకుంఠం రూ. 5వేలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో రేణుక, మద్ది అనిత, కుకునూరుపల్లి మండల లయన్స్‌క్లబ్ చైర్మెన్ మిట్టపల్లి రుషి, వినోద్ తదితరులున్నారు.

విద్యార్థులకు బెల్టులు, బ్యాడ్జీల పంపిణీ

రాయపోల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం రాంసాగర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఎంఈవో సత్యనారాయణరెడ్డి బెల్టులు, బ్యాడ్జీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలకు అన్ని వసతులు కల్పిస్తున్నదని పేర్కొన్నారు.

ఘనంగా మత్స్యకార దినోత్సవం

హుస్నాబాద్/హుస్నాబాద్‌రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హుస్నాబాద్ పట్టణంలోని చేపల మార్కెట్‌లో చేపల విక్రయదారులకు స్వీట్లు తినిపించి ఘనంగా సన్మానించారు. ముదిరాజ్ సంఘం మహాసభ నాయకుల ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన ముదిరాజ్ జెండాలను ఆవిష్కరించి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు.

మత్స్యకార వృత్తికి రక్షణ కల్పించాలి



వినతి పత్రం సమర్పిస్తున్న గంగపుత్ర సభ్యులు

సిద్దిపేట క్రైం నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కులవృత్తి దోపిడీని అడ్డుకోవాలని, కులవృత్తికి రక్షణ కల్పించాలనీ సిద్దిపేట గంగపుత్ర సంఘం అధ్యక్షుడు బిజ్జి రాజం అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఆయన గంగపుత్ర సంఘం సభ్యులతో కలిసి కలెక్టరేట్‌లోని మత్స్యశాఖ అధికారికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిద్దిపేట గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షులు పెంటం పోచయ్య , ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కిషన్ ,కోశాధికారి తొంట యాదగిరి, సభ్యులు మల్లేశం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ లేని స్థలాల్లో వైన్స్ షాపులకు పర్మిషన్ ఇవ్వొద్దు

హుస్నాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా పెట్టె వైన్స్ షాపులకు పార్కింగ్ స్థలాలుంటేనే పర్మిషన్ ఇవ్వాలని కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్ రెడ్డి శుక్రవారం మున్సిపల్, ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉన్న వైన్స్ షాపులకు పార్కింగ్ స్థలం లేక, ప్రధాన రహదారిపై వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయిందని, దీంతో ఈ షాపుల వద్ద చాలాసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. అలా జరగకుండా పార్కింగ్ స్థలం ఉంటేనే వైన్స్ షాపు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అనాథ అవ్వకు అండగా..

జగదేవ్‌పూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు సింపతి బాలమ్మ(68)కు అరికెపూడి సేవా ట్రస్ట్ అండగా నిలిచింది. 13 ఏళ్ల క్రితం భర్త చంద్రయ్య మృతి చెందడంతో అనాథగా మారిన బాలమ్మ గత ఎనిమిదేళ్లుగా మరుగుదొడ్డిలోనే నివాసం ఉంటున్నది. ఈ విషయం తెలుసుకున్న ట్రస్ట్ చైర్మన్ డా. రఘు స్పందించి భూమిపూజ నిర్వహించి మూడు నెలల్లో ఇంటినిర్మాణం పూర్తి చేయించారు. శుక్రవారం బాలమ్మతో దాతలు గృహ ప్రవేశం చేయించగా ఆమె సంతోషం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో రూరల్ మీడియా వ్యవస్థాపకుడు శ్యాంమోహన్, తిపర్తి రామ్‌ప్రసాద్, శ్రీపాద శివరాం ప్రసాద్, పావులూరి సాయిశశాంక్, అంకం నిర్మల, అకెనగారి పాండుగౌడ్, మేస్త్రి నరసింహం పాల్గొన్నారు. సామాజిక సేవే అరికెపూడి సేవా ట్రస్ట్ లక్ష్యమని డా. రఘు తెలిపారు.



దాతలతో కలిసి గృహ ప్రవేశం చేసిన బాలమ్మ

అడ్మిషన్ కావాలని సీఎంవో నుంచి సిఫార్సు.. ఇదీ ఇందిరానగర్ పాఠశాల గొప్పతనం

● త్వరలోనే ఫారిన్ లాంగ్వేజెస్ ప్రారంభిస్తా: మాజీమంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో అడ్మిషన్ కావాలని సీఎంవో నుంచి సిఫార్సు లేఖ రావడమంటే అది ఇందిరానగర్ పాఠశాల గొప్పతనమని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ఇందిరా నగర్ ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభిచారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో టాప్ 10 పాఠశాలల్లో, సిద్దిపేటలోని ఇందిరానగర్ పాఠశాల టాప్ 3లో ఉందని, ఇంకొంచెం సదుపాయాలు ఇవ్వగలిగితే ఇంకా ముందుకు వెళ్తామని వివరించారు. పాఠశాలలో ల్యాబ్ అండ్ డైనింగ్ హల్ కావాలని అడిగారని, నెలరోజుల్లో అవసరమైతే నా సొంత డబ్బులతో నిర్మాణం చేసి ఇస్తానని, విద్యార్థులకు లోటు మాత్రం రానివ్వనని చెప్పారు. విద్యార్థులు జాతీయస్థాయి క్రీడల్లో రాణిస్తున్నారని, ఆల్ రౌండ్‌గా ఇందిరానగర్ పాఠశాల అన్ని రంగాల్లో టాప్‌లో ఉందని సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థి మహమ్మద్ అనాస్ నేషనల్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో కెప్టెన్‌గా ఉండడం చాలా గర్వకారణమని, ప్రతీ మ్యాచ్ రన్నర్ అయ్యాడన్నారు. త్వరలోనే ఫారిన్ లాంగ్వేజెస్ కూడా ప్రారంభించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజనర్సు, పాల సాయిరాం, ఉపాధ్యాయులు ఆస లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలోని ఇందిరానగర్ పాఠశాలలో విద్యార్థులతో హరీశ్‌రావు

సిద్దిపేట ప్రతిష్టను కాపాడాలి

సిద్దిపేట పట్టణం దక్షిణ భారతదేశంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుకున్నామని, బెస్ట్ సిద్దిపేట, క్లిన్ అండ్ గ్రీన్ సిద్దిపేటగా నిత్యం విరాజిల్లాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. చెత్త సేకరణలో మార్పు రావాలని, రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 311 మంది లబ్ధిదారులకు రూ. 71.50 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు, వైస్ చైర్మన్ కనక రాజు, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు పర్యావరణ సంరక్షణలో ముందుండాలి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సునీత

సిద్దిపేట కల్చరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ, ఫిషరీస్ పీజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చేపల జీవవైవిధ్యం, మత్స్యకారుల సంక్షేమంపై అవగాహన పెంపు కోసం ప్రతి ఏటా ప్రపంచవ్యాప్తంగా మత్స్యకార దినోత్సవం నిర్వహించబడుతోందని ప్రిన్సిపాల్ డాక్టర్. జి. సునీత పేర్కొన్నారు. విద్యార్థులు పర్యావరణ సంరక్షణలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన జువాలజీ, ఫిషరీస్ విభాగాధిపతి డాక్టర్ పి అయోధ్యా రెడ్డి, అధ్యాపక బృందాన్ని ప్రశంసించారు. అధిక చేపలవేట, నీటి కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలు, వాతావరణ మార్పులు వంటి సమస్యలు చేపల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన దాదాపు 30 స్టాళ్లను సందర్శించి విద్యార్థుల ప్రతిభను మెచ్చుకున్నారు. ఇందులో విద్యార్థులచే సేకరించబడి నిల్వచేసిన దాదాపు 40 రకాల చేపలతో పాటు, చేపల విత్తనోత్పత్తి, బయోఫ్లాక్, అక్వేరియంలలో భద్రపర్చిన రకరకాల చేపలతో పాటు, ఆక్వాక్లినిక్, వృక్ష ప్లవకాలు, నీటిమొక్కలు, చేపలతో చేసిన వివిధ రకాల వంటకాలు, చేపలు పట్టడానికి ఉపయోగించే వలలు, పడవల రకాల స్టాళ్లను ప్రదర్శించారు. కళాశాల విద్యార్థులే కాకుండా వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ప్రదర్శనను సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల సీవోఈ డాక్టర్ గోపాల సుదర్శనం, అధ్యాపకులు డాక్టర్ లీలావతి, హేమలత , డాక్టర్ మధుసూదన్ రెడ్డి, విశ్వనాథ్, డాక్టర్ పుణ్యమ్మ, డాక్టర్ వైకుంఠం , డాక్టర్ జగదీశ్వర చారి, జి.శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్, డాక్టర్ మహేష్, డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ ఉమా మహేశ్వరిలతో పాటు దాదాపు 500ల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

చెక్కుముకి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ




చేర్యాలలో చెకుముకి టాలెంట్‌టెస్ట్ విజేతలకు ప్రశంసాపత్రం అందిస్తున్న నిర్వాహకులు

సిద్దిపేటరూరల్/సిద్దిపేట అర్బన్/చేర్యాల/జగదేవ్‌పూర్/కొండపాక,, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పలు మండలాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం చెకుముకి మండలస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. సిద్దిపేటలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి ప్రతిభ పరీక్షలో నారాయణరావుపేట మండలం మాటిండ్ల ఆర్డీఎఫ్ విద్యార్థులు పాఠశాల విద్యార్థులు నీరటి వెన్నెల,సానియాలు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణుమూర్తి తెలిపారు. అదేవిధంగా సిద్దిపేట వికాస్ హై స్కూల్‌కు నలుగురు విద్యార్థులు సహన్‌రెడ్డి, మనవిత్ రెడ్డి, సాత్విక్, గ్యానేశ్వర్ ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ మధుమోహన్ తెలిపారు. చేర్యాల పట్టణంలోని బాలికల జడ్పీఎస్ఎస్‌లో మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ లో ప్రభుత్వ ఇంగ్లీషుమీడియం విభాగంలో వీరన్నపేట జడ్పీఎస్ఎస్ విద్యార్థులు పి.వరుణ్, ఎండి. జుబీర్, పి.సాత్విక్, ప్రైవేటు పాఠశాలల విభాగంలో ఎం.రమ్యశ్రీ, పి.సింధు, డి.హర్షిణి, విజేతలుగా నిలిచారు. జగదేవ్‌పూర్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో సెయింట్ విన్సెంట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలువగా ఎంఈవో సైదులు బహుమతిని అందజేశారు. కొండపాకలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విభాగంలో జడ్పీహెచ్ఎస్ సిరిసినగండ్ల విద్యార్థులు సుహాన, హారిక, పరమేష్ ప్రథమ స్థానంలో నిలిచారు. నవంబరు 27న జరిగే జిల్లా స్థాయి పోటీలలో వీరుపాల్గొంటారని చెకుముకి మండల కన్వీనర్ పి.బాలకిషన్ తెలిపారు. కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో జిల్లా పరిషత్ పాఠశాల విభాగంలో ప్రథమ బహుమతి కోహెడ హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. అలాగే రెసిడెన్షియల్ పాఠశాల విభాగంలో కోహెడ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలకు ప్రథమ బహుమతి లభించింది. ప్రతిభ కనబరిచినవారికి ప్రశంసాపత్రాలను అందజేశారు.

గాంధీచౌక్ వద్ద దిగబడిన లారీ

చేర్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని గాంధీచౌక్ వద్ద శుక్రవారం రాత్రి లారీ దిగబడింది. దీంతో జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడ్డారు. రోడ్డు విస్తరణ పనులలో భాగంగా గాంధీ చౌక్ వద్ద హైలెవల్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొద్దిరోజుల క్రితం రోడ్డు ఎత్తుపెంచుతూ పోచమ్మ వీధికి వెళ్లేమార్గాన్ని మూసివేయడంతో పాటు కడవేరుగు వైపు సమాంతరంగా పూర్తిచేయకపోవడంతో ఒకేమార్గం గుండా రాకపోకలకు ఆటంకాలు తలెత్తుతున్నాయి. కంకర మిశ్రమాన్ని పూర్తిస్థాయిలో రోలింగ్ చేయకపోవడంతో వాహనాలు దిగబడుతున్నాయి. పనులు జరుగుతున్న ప్రదేశంలో కాంట్రాక్టర్ హెచ్చరిక, డైవర్షన్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. కానీ రోలింగ్ వాహనాలను నడిరోడ్డుపై పార్కింగ్ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి లోడుతో వెళుతున్న ఓలారీ రోడ్డుపై దిగబడిపోయింది. దీంతో గంటకుపైబడి రోడ్డుకు ఇరువైపులా వాహనాలన్నీ నిలిచిపోయి ప్రయాణీకులు, స్థానికులు నానాతంటాలు పడ్డారు. ట్రాఫిక్ జాంతో వాహనాల నడుమ అంబులెన్సు కూడా చిక్కుకుంది. నత్తనడకన సాగుతున్న పనులతీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.



రోడ్డుపై దిగబడిన లారీ

వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈ రామచంద్రయ్య

సిద్దిపేట నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ విషయంలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని విద్యుత్ సిద్దిపేట డివిజినల్ ఇంజనీర్ రామచంద్రయ్య సూచించారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో సిద్దిపేట డివిజన్‌లో పని చేస్తున్న విద్యుత్ సిబ్బందితో, ఇంజనీర్లతో కలిసి డివిజినల్ ఇంజనీర్ కే. రామచంద్రయ్య విద్యుత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి, క్షేత్రస్థాయిలో పని చేయాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సదస్సులో సిద్దిపేట డివిజన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మనుగడ

● అటవీ శాఖ ప్రధాన సంరక్షణ అధికారి డా. సి. సువర్ణ

ములుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మానవాళికి మనుగడ ఉంటుందని అటవీ శాఖ ప్రధాన సంరక్షణ అధికారి డా. సి. సువర్ణ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలంలోని అటవీ కళాశాల, పరిశోధనా సంస్థలో పర్యావరణం, వ్యర్థాల నిర్వహణ సమస్యలు, ప్రభావాలు, సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై రెండురోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు డీన్ వి. కృష్ణ అధ్యక్షత వహించగా డా. డి రాజిరెడ్డి, డా. ప్రియాంక వర్గీస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సువర్ణ మాట్లాడుతూ పట్టణీకరణ కారణంగా కాలుష్యం పెరుగుతుందని, వ్యర్థాలు పేరుకుపోతున్నాయని, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరమని తెలిపారు. వక్తలు ప్లాస్టిక్ వాడకం తగ్గించి, వ్యర్థాల నిర్వహణ ఇంటి నుంచే ప్రారంభించాలని, రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ నినాదాన్ని పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో డా.ఎన్.ఎస్ శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై ఎన్ఎస్ఎస్ విద్యార్థుల అవగాహన

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గాంధీనగర్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు చెందిన జాతీయ సేవా పథకం విద్యార్థులు శుక్రవారం గ్రామంలోని వార్డుల్లో తిరిగి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో డబ్బు ప్రలోభాలకు లొంగకుండా గ్రామాభివృద్ధికి పాటుపడే మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. శీతాకాల శిబిరంలో భాగంగా ఎన్‌వీ ప్రసాద్ కంటి వైద్యులు గ్రామస్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మానవ నైపుణ్యాల వినియోగం, సామాజిక బాధ్యత, స్వచ్ఛత ఆరోగ్యంపై ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించి పంచాయతీ కార్యాలయం ముందు మానవ హారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం చైర్మన్ గంగాధర్, ప్రోగ్రాం ఆఫీసర్ రణదీర్‌కుమార్, హెచ్ఎం అరుణాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దు

సిద్దిపేట క్రైం నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్లను ఆక్రమించి పండ్ల వ్యాపారం చేయవద్దని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులను నివారించే క్రమంలో ఆయన సీతారామాంజనేయ థియేటర్ ఏరియా నుంచి ఓల్డ్ బస్టాండ్ సెంట్రల్ బ్యాంక్ ప్రాంతాలలో రోడ్డును ఆక్రమించి పండ్ల వ్యాపారం చేస్తున్న తోపుడు బండ్ల యజమానులకు అవగాహన కల్పించారు. రోడ్ల పై తోపుడు బండ్లు పెట్టడం వల్ల వాహనదారులకు, ప్రజలకు తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయని వివరించారు. తోపుడు బండ్ల యజమానులు తక్షణమే రోడ్డును ఖాళీ చేసి, మరో ప్రదేశంలో తమ వ్యాపారాన్ని నిర్వహించుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌ను ఇబ్బందులకు గురిచేసే తోపుడు బండ్ల యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

ములుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్‌వీఎం కళాశాల విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ కె. వెంకట్‌రెడ్డి సూచించారు. ఆయన ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్, రోడ్డు ప్రమాదాలు, యాంటీర్యాగింగ్, యాంటీడ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం వల్ల వచ్చే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యలు, ర్యాగింగ్, చట్టపరమైన శిక్షలు గురించి వివరించారు. కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శంకర్, ములుగు ఎస్ఐ రఘుపతి, మెడికల్ కాలేజీ డీన్ శ్రావణ్‌కుమార్, డైరెక్టర్ గోపీకృష్ణ, సీఈవో దేవరకొండ శ్రీనివాస్‌రావు, విజిలెన్స్ ఆఫీసర్ రవికుమార్, సీఎస్ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై కఠిన చర్యలకు సిద్ధమైన పోలీసులు

రాయపోల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మద్యం అక్రమ విక్రయాలను నియంత్రించేందుకు బెల్ట్‌షాపులను మూసివేయడానికి మండలంలోని పోలీసులు సిద్ధమయ్యారు. రాయపోల్, అంకిరెడ్డిపల్లి గ్రామాల్లో రెండు మద్యం దుకాణాలు ఉండగా, వాటికి అనుబంధంగా ఆయా గ్రామాల్లో సుమారు 200 వరకు బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయి. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నప్పటికీ ఇప్పటివరకు ఎక్సైజ్, పోలీస్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అయితే ఇటీవల రాయపోల్ ఎస్ఐ మానస ఆధ్వర్యంలో పోలీసులు పలు గ్రామాల్లో దాడులు నిర్వహించి బెల్ట్‌షాపుల యజమానులపై కేసులు నమోదు చేశారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల వాట్సాప్ గ్రూపుల్లో విలేజ్ పోలీస్ ఆఫీసర్‌లు(వీపీవో) బెల్ట్‌షాపులు మూసివేయాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేస్తూ సందేశాలను పంపించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 16మందికి జరిమానా..ఇద్దరికి జైలు

గజ్వేల్/సిద్దిపేట రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 17 మంది వాహనదారులను శుక్రవారం ఆయా కోర్టుల్లో హాజరుపరచగా న్యాయాధికారులు వారికి రూ.1.60లక్షల జరిమానా విధించారు. నిందితుల్లో ఇద్దరికి జైలు శిక్షను విధిస్తూ తీర్పు చెప్పారు. గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం.మురళి తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల గజ్వేల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వాహనతనిఖీల్లో 16 మంది మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. వారిని గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ ఎదుట కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు. నిందితుల్లో ఒకరికి జరిమానాతో పాటు 2 రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారు. సిద్దిపేట రూరల్ ఎస్ఐ కె.రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 20న సాయంత్రం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డాడు. నిందితుడిని సిద్దిపేట ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తరుణి ఎదుట కోర్టులో హాజరుపరచగా 10రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో సమష్టిగా పనిచేయండి



కొమురవెల్లిలో యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పల్లా

కొమురవెల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలంతా సమష్టిగా పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశమై ఎన్నికలకు సంబంధించి పలు విషయాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. మండలకేంద్రంలో పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరగా ఏమ్మెల్యే పల్లా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

● కొండపోచమ్మను దర్శించుకున్న పల్లా

జగదేవ్‌పూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిగుల్ నర్సాపూర్ సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకొండపోచమ్మ అమ్మవారిని జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రె డ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జిల్లెలగడ్డ గురుకుల విద్యార్థులకు అవార్డులు



గోల్డ్,సిల్వర్ అవార్డులు అందుకున్న విద్యార్థులు

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోన జిల్లెలగడ్డ సాంఘిక సంక్షేమశాఖ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులకు బంగారు, వెండి పతకాలు, అవార్డులు అందుకున్నారు. గత అక్టోబరులో ముంబైకి చెందిన సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి మాస్టర్ ఆర్ట్స్ కాంపిటేషన్ పోటీలను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఇటీవల ఫలితాలు వెలువరించగా జిల్లెలగడ్డ సాంఘిక సంక్షేమశాఖ గురుకులానికి చెందిన 16 మంది విద్యార్థులు అవార్డులు అందుకున్నారు. ఇందులో ఆరుగురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, మరో ఆరుగురికి సిల్వర్ మెడల్స్, ఇద్దరికి ఆర్ట్ మాస్టర్ అవార్డ్ ట్రోఫీ ఒకరికి, స్పెషల్ సర్‌ప్రైజ్ గిఫ్, ఒకరు 3వ బహుమతిగా స్కూల్ బ్యాగ్ అందుకున్నట్లు ప్రిన్సిపాల్ శ్యామలత తెలిపారు.

చేర్యాల సీఐపై చర్యలు తీసుకోవాలి: సీపీఎం

చేర్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జనగామ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కుమ్మక్కై ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు, బైండోవర్లు చేస్తున్న చేర్యాల సీఐ శ్రీనుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం నాయకులు శుక్రవారం సిద్దిపేట సీపీ విజయ్‌కుమార్, హుస్నాబాద్ ఏసీపీ సదానందంలకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ సీఐ తీరు పట్ల సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసినవారిలో పార్టీ జిల్లాకార్యదర్శివర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి, నాయకులు ఉన్నారు.

ఊరు..పోరు

(5వ పేజీ తరువాయి)

పడడంతో ఆశావహులు సిద్దమవుతున్నారు. 2019లో నిర్వహించిన ఎన్నికల ప్రాతిపదికనే రిజర్వేషన్లు ఉంటాయనే సంకేతాలు రావడంతో ఆ దిశగా ఆలోచిస్తున్నారు. మరోవైపు పాత రిజర్వేషన్ల ప్రకారమే కోటా ఉంటుందని.. కాకపోతే ఆయా గ్రామాల రిజర్వేషన్లు మారతాయనే చర్చ జరుగుతోంది. అందుకే రిజర్వేషన్ల వైపు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక ఎన్నికల తేదీలు కూడా ఖరారు కాకపోవడంతో డిసెంబరులోనా.. లేక జనవరిలో ఎన్నికలు ఉంటాయా అని తర్జనభర్జన పడుతున్నారు. గత పరిణామాల నేపథ్యంలో ఇంతకు ఎన్నికలు జరుగుతాయా.. లేదా అనే అనుమానాలను సైతం పలువురు వ్యక్తపరుస్తున్నారు.

రాష్ట్రంలో డీఈవో నియామకాలు చేపట్టాలి

(5వ పేజీ తరువాయి)

పిల్లల్లో ఉన్న ఆలోచనలకు ఒక రూపం కల్పించేది సైన్స్ ఫెయిర్ అని, ఈ రోజుల్లో ప్రపంచమంతా స్టార్టప్ యుగం నడుస్తుందని తెలిపారు. రాష్ట్రంలో అత్యుత్తమ సైన్స్‌ఫెయిర్ అవార్డు సిద్దిపేటకు వచ్చిందని, సిద్దిపేటను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరును తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ మనోహర్, ఆస లక్ష్మణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, నాయకులు రాజనర్సు, బర్ల మల్లికార్జున్, పాల సాయిరాం, వజీర్, బందారం రాజు, మోయిద్, మోయిజ్ పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన

బాలల జిల్లాస్థాయి వైజ్ఞానిక, ప్రేరణ ప్రదర్శనలు ముగిశాయి. మూడు రోజులపాటు జరిగిన ఈ వేడుకల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు రూపొందించిన నమూనాలు అందరిని ఆలోచింపజేశాయి. జిల్లా వ్యాప్తంగా 236 నమునాలు రాగా, రాష్ట్రస్థాయికి 19 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. అలాగే రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శ నలో 187 ఎగ్జిబిట్స్ ఉపాధ్యాయ ప్రాజెక్టులు 5 ప్రదర్శించగా ఇందులో ఏడు అంశాల వారీగా ప్రతి అంశానికి సంబంధించి రెండు ప్రాజెక్టులను స్టైట్ లెవల్‌కు సెలక్ట్ చేశారు. అలాగే ఒకటి ఉపాధ్యాయ ప్రాజెక్ట్ ఎంపిక చేశారు. శుక్రవారం రోజన సుమారు 3 వేల మంది విద్యార్థులు ప్రదర్శనను వీక్షించారు. చివరి రోజు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

బీసీ హాస్టల్‌కు రూ.6 లక్షల విలువ చేసే బెడ్స్ పంపిణీ..

సిద్దిపేట అర్బన్/సిద్దిపేట రూరల్ : మండలంలోని తడకపల్లి పరిధిలో గల బీసీ హాస్టల్‌కు సుమారు రూ.6 లక్షల విలువ చేసే బెడ్స్ పంపిణీ చేసి ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీశ్‌రావు తన ఔదార్యం చాటుకున్నారు. శుక్రవారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపల్‌కు స్థానిక నాయకులతో కలిసి హరీశ్‌రావు వాటిని అందించారు. పాఠశాల స్థాయి నుంచే జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని మాజి మంత్రి,ఎమ్మెల్యే హరీశ్‌రావు పెర్కొన్నారు. అథ్లెటిక్ పోటీల్లో కేవీఆర్ఎస్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు జాతీయ స్థాయికి ఎంపికైన సందర్భంగా శుక్రవారం సిద్దిపేటలో హరీశ్‌రావు అభినందించారు. హర్యానాలోని భీవనిలో ఈనెల 26 నుంచి 29 వరకు జరిగే జాతీయ పోటీల్లో జెల్ల అవంతిక, దుపంటి రుత్విక పాల్గొంటారని మండల విద్యాధికారి కొత్త రాజిరెడ్డి తెలిపారు.